సెల్ఫీ విత్‌ గణేశ్‌



అమెరికాలోని టేనస్సీలో తమ స్వగృహంలో మట్టి గణపతి విగ్రహానికి పూజలు చేస్తున్న కోదాడకు చెందిన సాయిరామ్‌- సౌమ్య దంపతులు.

క్లుప్తంగా

వాహనాల వేలం

హుజూర్‌నగర్‌ : హుజూర్‌నగర్‌ ఎక్సైజ్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాల వేలం పాటను గురువారం పట్టణంలోని ఎక్సైజ్‌ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 45 వాహనాలకు వేలం నిర్వహించగా రూ.7,84,936లు వచ్చినట్లు ఎక్సైజ్‌ సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. 3 వాహనాలకు నిర్ణయించిన ధర రాకపోవడంతో మళ్లీ వేలం వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌ జిల్లా అధికారి అనిత, ఎస్‌ఐ వెంకన్న, దివ్య, జగన్‌మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులు తనిఖీ

మఠంపల్లి : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా పారిశుద్ధ్య పనులను పూర్తిచేయాలని ఎంపీఓ ఆంజనేయులు కోరారు. గురువారం మండలంలోని బక్కమంతులగూడెంలో గ్రామపంచాయతీ రికార్డులను, సెగ్రిగేషన్‌ షెడ్డును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ బేత విజయకుమారివెంకటరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్‌, వార్డుసభ్యులు ఉన్నారు.

సౌండ్‌ సిస్టం బహూకరణ



సౌండ్‌ సిస్టంను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

కోదాడరూరల్‌ : పట్టణ పరిధిలోని తమ్మరలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు చుండూరు ప్రసాదరావు రూ.50 వేల విలువ గల సౌండ్‌ సిస్టంను బహుకరించారు. అనంతరం పాఠశాల నుంచి బదిలీపై నల్లబండగూడెం ఉన్నత పాఠశాలకు వెళ్లిన హెచ్‌ఎం వక్కవంతుల వసంతను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం జీవీజీ.రాజు ఉపాధ్యాయులు కన్నా సాహెబ్‌, లక్ష్మీనారాయణ, నరసింహ, ధామస్‌రెడ్డి, చుండూరు ప్రసాదరావు, లక్ష్మీ, కృష్ణవేణి, స్వర్ణకుమారి, మమత, అనిత ఉన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న టెక్‌ విజన్‌ సంస్థ ప్రతినిధులు

మునగాల : మండలంలోని మాధవరంలో పిండి గోపిరెడ్డి అనే వ్యక్తి హైదరాబాద్‌లోని టెక్‌ విజన్‌ సంస్థలో సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తూ గత ఏడాది జాతీయ రహదారిపై చివ్వెంల మండలం గుంపుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. దీంతో గురువారం టెక్‌ విజన్‌ సంస్థకు చెందిన సిబ్బంది రూ.లక్షా ఇరవై వేల ఆర్థికసాయాన్ని గోపిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ తమ సంస్థలో పనిచేసే గోపిరెడ్డి ప్రమాదానికి గురయ్యాడని తెలుసుకొని గతంలో రూ.2.30 లక్షలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎలక గోపిరెడ్డి, ఝాన్సీలక్ష్మి, బోళ్ల నవీన్‌రెడ్డి, రామినేని నరేష్‌, మధన్‌రెడ్డి, వంశీరెడ్డి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగానికి పాల్పడితే సహించం

హుజూర్‌నగర్‌ : మున్సిపల్‌ నిధులు దుర్వినియోగానికి పాల్పడితే సహించేది లేదని మున్సిపల్‌ కౌన్సిలర్లు కస్తాల శ్రవణ్‌ కుమార్‌, తేజావత్‌ రాజనాయక్‌, కోతి సంపత్‌ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీకి ఎటువంటి నిధులు వచ్చినా అభివృద్ధికి స్వాగతిస్తామని చెప్పారు. మెయిన్‌రోడ్డు పైపులైన్‌ విషయంలో ఎస్టిమేషన్‌ పెంచి నిధులు కాజేయాలని చూస్తే నిధులు దుర్వినియోగం కాకుండా కోర్టుకు వెళ్లామని, కేసులతో అభివృద్ధిని అడ్డుకోలేదని తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం నేరేడుచర్లలోని ప్రాథమిక పాఠశాలలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, హెచ్‌ఎం రమేష్‌, లయన్స్‌ క్లబ్‌ సభ్యులు పోరెడ్డి శ్రీరాంరెడ్డి, రామస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నర్సింహారావు, ఉపాధ్యాయులు సైదులు, అరుణ తదితరులు ఉన్నారు.

సాగర్‌ ఆయకట్టుకు ఎస్సారెస్పీ జలాలు

- ఎండిపోతున్న పైర్లకు జీవం
- 300 ఎకరాలకు మోటార్ల ద్వారా నీరందిస్తున్న రైతాంగం

మునగాల : సాగర్‌ ఆయకట్టులో ఎండిపోయే దశకు చేరుకున్న వరి పొలాలకు ఎస్సారెస్పీ జలాలు జీవం పోశాయి. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో సాగర్‌ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు రాకపోవడంతో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగర్‌ ఎడమ కాలువ ద్వారా సాగర్‌ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయలేదు. కానీ భవిష్యత్‌లో వర్షాలు కురిసి సాగర్‌ నీరు రాకపోతుందా అనే ఆశతో మండలంలోని పలు గ్రామాల రైతులు సాగర్‌ ఆయకట్టు ప్రాంతంలో బోర్లు, బావుల కింద వరిసాగు చేశారు. కానీ వర్షాలు లేక భూగర్భ జలాలు పూర్తిస్థాయిలో పడిపోయి బోర్లు, బావులు అడుగంటి వరిపైర్లకు సాగునీరు అందక ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఈ తరుణంలో ఎస్సారెస్పీ జలాలు రైతాంగాన్ని ఆదుకున్నాయి. మోతె మండలం నామవరం తదితర గ్రామాలకు ఎస్సారెస్పీ జలాలు వస్తుండడంతో ఆయా గ్రామాల్లో చెరువులు పూర్తిస్థాయిలో నిండి దిగువన ఉన్న మండలంలోని మాధవరం చెరువుకు వచ్చి చేరుతున్నాయి. దీంతో గత నెల రోజులుగా మాధవరం ఊరచెరువు అలుగు పోస్తుండడంతో దిగువన ఉన్న మొద్దుల చెరువు, ఎర్ర చెరువులోకి పుష్కలంగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో ఆయా చెరువులకు చేరిన వరద నీరు గురప్పవాగు ద్వారా మండలంలోని తాడువాయి, మునగాల, గణపవరం, చిలుకూరు మండలం పోలేనిగూడెం, కొండాపురం గ్రామాల మీదుగా బేతవోలు ఊరచెరువుకు వచ్చి చేరుతోంది.



గణపవరం శివారులోని వాగులో ప్రవహిస్తున్న ఎస్సారెస్పీ జలాలు

మరో 500 ఎకరాలకు సైతం..

కాగా, గురప్పవాగుకు అనుబంధంగా ఉన్న వాగుకు ఇరుపక్కల ఉన్న రైతులు విద్యుత్‌ మోటార్లు ఏర్పాటు చేసుకొని ఎండిపోతున్న తమ వరి పొలాలకు కాపాడుకుంటున్నారు. దీంతో తాడువాయి, గణపవరం, మునగాల, తదితర గ్రామాల్లో సుమారు 300 ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. దీంతో సాగర్‌ ఆయకట్టుకు చెందిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదే వాగు ద్వారా ఎక్కువైన నీరు చిలుకూరు మండలంలో గల బేతవోలు ఊరచెరువుకు చేరుతుండడంతో సదరు చెరువుకు పూర్తిస్థాయిలో నీరు వచ్చి చేరడంతో చెరువు నిండుకుండలా మారింది. ఇదే చెరువు కింద మరో 500 ఎకరాలకు ప్రస్తుత సీజన్‌లో సాగు నీరు అందే అవకాశం లభించింది. ఎండిపోయే దశలో ఉన్న పొలాలకు ఎస్సారెస్పీ జలాలు అందడంతో ఊపిరి పోసినట్లు అయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వాగులో నుంచి మోటారు ద్వారా పొలాలకు నీరందిస్తున్న గణపవరం రైతు

ఎస్సారెస్పీ జలాలతో వరిపైరును కాపాడుకుంటున్నాను



సాగర్‌ ఆయకట్టు కింద నాకున్న మూడు ఎకరాల భూమిలో బోరు ఆధారంగా వరి సాగు చేశాను. తీవ్ర వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో భూగర్భ జల వనరులు పడిపోయి బోరులో నీరు తగ్గి సాగు చేసిన వరిపైరు ఎండిపోయే దశకు చేరుకుంది. ఈ సమయంలో వాగు ద్వారా ఎస్సారెస్పీ జలాలు రావడంతో మోటారు సాయంతో సాగునీరు అందించి వరిపైరును కాపాడుకుంటున్నాను.

– చందా రాధాకృష్ణ, రైతు, గణపవరం

కొండా లక్ష్మణ్‌ బాపూజీకి ఘన నివాళి



హుజూర్‌నగర్‌ : లక్ష్మణ్‌ బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్‌ : తెలంగాణ కోసం అవిశ్రాంత పోరాటం చేసిన యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్‌ బాపూజీ అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్‌ ధనుంజయనాయుడు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందరావు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో కొండా లక్ష్మణ్‌ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ధూళిపాల శ్రీనివాసరావు, జె.శ్రీనివాస్‌ గౌడ్‌, గూడెపు దీప, ముషం సత్యనారాయణ, లింగారావు, సైదులు, వెంకటేశ్వర్లు, శంభయ్య, శ్రీను, వెంకన్న, నాగేశ్వరరావు, వెంకటరమణ, కృష్ణ, ఉపేంద్రాచారి, మధు, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : నేరేడుచర్లలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆచార్య కొండా లక్ష్మణ్‌ బాపూజీ 11వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు పిల్లలమర్రి పుల్లారావు, ప్రధాన కార్యదర్శి యర్రమాద యాదగిరి, నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రం మార్కెండేయ, నాయకులు నర్సింహ, రమాదేవి, సైదులు, శ్రీను, గిరి, శేఖర్‌, యుగేందర్‌, ఉపేందర్‌, సత్యనారాయణ, నాగరాజు, సోమశేఖర్‌, శివ తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాలు, ఆకుకూరలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ నాగేశ్వరరావు

హుజూర్‌నగర్‌ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు ఒక పూట సంపూర్ణ భోజనం అందిస్తుందని మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ జక్కుల నాగేశ్వరరావు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌ సెక్టార్‌లో పోషణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, అన్ని రకాల ఆకుకూరలు, కాయగూరలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ పోషకాహారం లోపం నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్‌ సోమమ్మ, పోషణ అభియాన్‌ కోఆర్డినేటర్‌ రాజేష్‌, వైద్య సిబ్బంది నూర్జహాన్‌, లలిత అంగన్‌వాడీ టీ చర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని రాస్తారోకో



పాలకవీడు : రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

పాలకవీడు : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్‌ మండల అధ్యక్షుడు మాతంగి విజయ్‌ ప్రభుత్వాలను డిమాండ్‌ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని రోడ్డుపై ఎమ్మార్పీఎస్‌ నాయకులతో కలిసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై పదిరోజులుగా దీక్ష చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ నాయకులు నాగరాజు, చిట్టిబాబు, వంశీ, నవీన్‌, గోపి, నవీన్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మఠంపల్లి : పార్లమెంట్‌ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్‌ మంగకు ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దేవపంగు బాబు, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు కస్తాల వెంకటేశ్వర్లు, దేవపంగు ప్రసాద్‌, రాయల్‌, కొండలు, నాగేష్‌, బాబు, నాగరాజు, ప్రవీణ్‌, వినయ్‌ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌ : చింతలపాలెంలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

చింతలపాలెంలో..

హుజూర్‌నగర్‌ (చింతలపాలెం) : పార్లమెంట్‌ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్‌ చేస్తూ చింతలపాలెంలో ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌.రమేష్‌, సీహెచ్‌.బాలచంద్రుడు, సీహెచ్‌.నాగేశ్వరరావు, పి.శ్రీను, ప్రేమ్‌కుమార్‌, రవి, సురేందర్‌, మణికుమార్‌, కాంగ్రెస్‌ నాయకులు సైదులు తదితరులు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

అనంతగిరి : బోదకాలు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కీటక జనిత వ్యాధుల నివారణ జిల్లా అధికారిణి డాక్టర్‌ సాహితి అన్నారు. గురువారం మండల పరిధిలోని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోదకాలు వ్యాధిగ్రస్తులకు బకెట్‌లు, పలు రకాల వస్తువులను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్‌తో కలిసి ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోదకాలు వ్యాధిగ్రస్తులు కాళ్ల పరిశుభ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బోదకాలు సోకకుండా ప్రతిఒక్కరూ ముందస్తుగా డీఈసీ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్‌ లక్ష్మీప్రసన్న, షాబుద్దీన్‌, అంజయ్య, కళావతి, విజయ్‌కుమార్‌, శ్రీదేవి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

ఆబోతుకు అంత్యక్రియలు



ఆబోతు అంతిమయాత్రలో పాల్గొన్న సర్పంచ్‌, మాజీ సర్పంచ్‌, గ్రామస్తులు

మఠంపల్లి : మండల కేంద్రంలో గురువారం వృషభరాజు (ఆబోతు) మృతి చెందింది. దీంతో గ్రామస్తులంతా కన్నీటి వీడ్కోలు పలికారు. ఆబోతు మృతదేహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ప్రధాన వీధులలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అంత్యక్రియలు జరిపారు. ఆబోతు మృతి తమను కలచి వేసిందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ మన్నెం శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్‌ కొండేటి సుధాకర్‌రెడ్డి, మాజీ నీటి సంఘం చైర్మన్‌ మన్నెం శేషిరెడ్డి, గాయం రాంచంద్రారెడ్డి, సమట్టారెడ్డి, నర్సిరెడ్డి, రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయులు

నడిగూడెం : సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయులని తహసీల్దారు టి.నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన ఉపాధ్యాయురాలు కనకమ్మ, శైలజలను సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో నడిగూడెం స్కూల్‌ కాంప్లెక్స్‌ చైర్మన్‌ శోభన్‌బాబు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, శ్రీధర్‌, బత్తిని శ్రీను, మౌలానా, మేరాజుద్దీన్‌, శ్రీకళ, కర్ణలత, మమత, చైతన్య, అరుణజ్యోతి, సరళాదేవి పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తహసీల్దార్‌ నాగేశ్వరరావు, తదితరులు

ఎన్జీఓస్‌ కాలనీ మెయిన్‌ రోడ్డు నిర్మిస్తాం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్‌ : పట్టణంలోని ఎన్జీఓస్‌ కాలనీ మెయిన్‌ రోడ్డును రూ.35 లక్షలతో నిర్మిస్తామని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్జీఓస్‌ కాలనీలో నిర్వహిస్తున్న గణేష్‌ నవరాత్రి ఉత్సవాల్లో గురువారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు వేయడంతో అసంపూర్తిగా ఉన్న పట్టణంలోని మెయిన్‌ రోడ్డు మరో వైపును కూడా పూర్తి చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్‌ ప్రకటించిన రూ.25 కోట్లతో మున్సిపాలిటీని పూర్తి స్థాయిలో అభివృద్ధి పరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సీఐ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గరిడేపల్లి : మండలంలోని రామచంద్రాపురంలో మిర్యాలగూడ రూరల్‌ సీఐ ముత్తినేని సత్యనారాయణ తండ్రి ముత్తినేని లక్ష్మీనరసయ్య ఇటీవల మృతి చెందారు. గురువారం గ్రామంలో నిర్వహించిన ఆయన దశదిన కర్మకు ఎమ్మెల్యే హాజరై సీఐ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా రాయినిగూడెంలో పీఏసీఎస్‌ మాజీ చైర్మన్‌ ఎరగాని గురువయ్య తల్లి సాయమ్మ ఇటీవల మృతి చెందగా గురువారం ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట హుజూర్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ కడియం వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్‌, సర్పంచ్‌ బోలిశెట్టి సుధీర్‌, గడ్డిపల్లి మాజీ సర్పంచ్‌ మాశెట్టి శ్రీహరి, మాజీ ఎంపీటీసీ గురువయ్య, తదితరులు ఉన్నారు.



హుజూర్‌నగర్‌: ఎన్‌జీఓస్‌ కాలనీలోని వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌

నడిగూడెం : పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ కోరారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో 23 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, ఏడుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి, పథకాల అమలు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ టి.నాగేశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, స్థానిక సర్పంచ్‌ గడ్డం నాగలక్ష్మి, నడిగూడెం సహకార సంఘం చైర్మన్‌ పుట్టా రమేష్‌, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అనంతగిరి : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తుందన్నారు. ఆయన వెంట ఆర్డీఓ సూర్యానారాయణ, తహసీల్దార్‌ రవికుమార్‌, ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, ఈదుల కృష్ణయ్య, వెంపటి వెంకటేశ్వరరావు ఉన్నారు.



నడిగూడెం : కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌

రెండవరోజు కొనసాగిన జేఎల్‌ పరీక్ష

అనంతగిరి : మండల కేంద్రంలోని అనురాగ్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో జూనియర్‌ లెక్చరర్‌ పరీక్ష రెండవరోజు యదావిధిగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎంవీ శివప్రసాద్‌ గురువారం తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 210 మంది అభ్యర్థులకు గాను 145 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 210 మంది విద్యార్థులకు గాను 148 మంది హాజరయ్యారని తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు ఏడుగురు అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి పది నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు.



ఆలస్యంగా వచ్చి పరీక్ష కేంద్రం వద్ద ఆగిపోయిన అభ్యర్థులు

గణేష్‌ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మునగాల : గణేష్‌ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని బుర్రా ఫౌండేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్రా ప్రమోద్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని నర్సింహాపురంలోని దళితవాడలో అంబేద్కర్‌ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్‌ విగ్రహం వద్ద ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా తమ ఫౌండేషన్‌ ద్వారా 150కి పైగా గణేష్‌ విగ్రహాలను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ, అంబేద్కర్‌ యువజన సంఘం సభ్యులు ప్రమోద్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోదాడ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ బుర్రా సుధారాణి –పుల్లారెడ్డి దంపతులు, శ్రీకోదండ రామస్వామి ఆలయం ప్రధాన అర్చకుడు శేషాచార్యులు, వార్డు సభ్యులు మాదాసు ప్రభాకర్‌, శ్రీలత, పంచాయతీ కార్యదర్శి కిన్నెర వీరబాబు, అంబేద్కర్‌ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపన అభినందనీయం

కోదాడరూరల్‌ : మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం అభినందనీయమని ఎస్‌ఐ రామాంజనేయులు, జిల్లా ప్రెస్‌ క్లబ్‌ అధ్యక్షుడు కారింగుల అంజన్‌గౌడ్‌ అన్నారు. గురువారం పట్టణంలోని 30వ వార్డులో శ్రీరామ గణేష్‌ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజలో పాల్గొని మాట్లాడారు. వేలంలో లడ్డూ దక్కించుకున్న వారికి అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వార్డు పెద్దలు ఉన్నారు.



మునగాల : నర్సింహాపురంలో పూజలు చేస్తున్న బుర్రా ప్రమోద్‌రెడ్డి, తదితరులు

జెడ్పీటీసీ, ఎంపీపీ పూజలు

మఠంపల్లి : మండలంలో వినాయక చవితి వేడుకలు కొనసాగుతున్నాయి. గురువారం బోడబండతండాలో జెడ్పీటీసీ జగన్‌నాయక్‌ దంపతులు, గుర్రంబోడు తండాలో ఎంపీపీ ముడావత్‌ పార్వతీకొండా నాయక్‌ దంపతులు గణనాథుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పలు గిరిజన తండాల్లో వినాయక మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

నేరేడుచర్ల : నేరేడుచర్లలో పాల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నాగండ్ల శ్రీధర్‌ ప్రారంభించారు. ముందుగా వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ చందమళ్ల జయబాబు, డీసీసీబీ డైరెక్టర్‌ దొండపాటి అప్పిరెడ్డి, ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్‌, బీఆర్‌ఎస్‌ పట్టణ ఇన్‌చార్జ్‌ కొణతం సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు చిన వెంకట్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జంగయ్య, గణేష్‌ ఉత్సవ నిర్వాహకులు టీఎస్‌ స్వామి, సత్యనారాయణ, సుధాకర్‌, మోహన్‌, రాంమోహన్‌రావు తదితరులు ఉన్నారు.



కోదాడరూరల్‌ : భక్తుడికి లడ్డూ అందజేస్తున్న ఎస్‌ఐ రామాంజనేయులు, అంజన్‌గౌడ్‌



మఠంపల్లి : బోడబండతండాలో గణనాథునికి పూజలు చేస్తున్న జెడ్పీటీసీ దంపతులు

సంక్షిప్త సమాచారం

సమస్యలపై ఉద్యమాలను ఉధృతం చేయాలి

గరిడేపల్లి : వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్‌ అన్నారు. గురువారం మండలంలోని మంగాపురంలో ఐఎఫ్‌టీయూ గ్రామ శాఖ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో గుండు వెంకన్న, కోడి సైదులు, కోడి వెంకటేశ్వర్లు, బత్తిని సీతారాములు, పోటు లక్ష్మయ్య, బత్తిని సైదులు, కామళ్ల సుందరయ్య, నాగరాజు ఉన్నారు.

డీలర్‌ కుటుంబానికి పరామర్శ

మోతె : మండల పరిధిలోని నర్సింహాపురంలో గుండెపోటుతో రేషన్‌ డీలర్‌ కొండా రామ్మూర్తి మృతి చెందడం బాధాకరమని బీఆర్‌ఎస్‌ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు అన్నారు. గురువారం గ్రామంలో జరిగిన రామ్మూర్తి అంత్యక్రియల్లో పలువురు నాయకులు, డీలర్లు పాల్గొని ఆయన మృత దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించారు.

ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి

మునగాల : సాగర్‌ ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ మండల నాయకుడు మండవ చంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎడమకాలువ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన వరిపైర్లు తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతున్నాయని తెలిపారు.

నేడు ఆయుష్మాన్‌ భవ వైద్యశిబిరం

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం ఆయుష్మాన్‌ భవ పథకం ద్వారా ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఆయుష్మాన్‌ భవ నోడల్‌ అధికారి డాక్టర్‌.కళ్యాణ్‌చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

హుజూర్‌నగర్‌ : లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆ క్లబ్‌ ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల గవర్నర్‌ శివ ప్రసాద్‌ అన్నారు. గురువారం పట్టణంలో లయన్స క్లబ్‌ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పొంచర్ల లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు కోల నాగేశ్వరరావు, నాగయ్య, సత్యనారాయణ రెడ్డి, శాంతయ్య, నాగేందర్‌ వెంకటేశ్వర్లు, రాంప్రసాద్‌, నాగిరెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం ఉండొద్దు

గరిడేపల్లి : మండలంలో గృహలక్ష్మి పథకం అమలులో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చూడాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం గరిడేపల్లి తహసీల్దార్‌ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి యాకుబ్‌ మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం అమలులో రాజకీయ నాయకుల జోక్యం ఉంటే అర్హులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. పార్టీ నాయకులు భిక్షం, లక్ష్మయ్య, మైబెల్లి, నాగులు, ఉపేందర్‌, శ్రీను, పూర్ణాచారి, మల్లయ్య, లక్ష్మయ్య, నాగమణి, సునీత, నరసయ్య ఉన్నారు.

సాగు, తాగు నీరు విడుదల చేయాలని వినతి

హుజూర్‌నగర్‌ : సాగర్‌ ఆయకట్టు పరిధిలో సాగు, తాగు నీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌ వేముల శేఖర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు గురువారం హుజూర్‌నగర్‌లోని నీటి పారుదల ఈఈ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టు పరిధిలో బోర్లు, బావులు ఎండిపోయి రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కుందూరు కోటిరెడ్డి, నాయకులు సీహెచ్‌.ఉమామహేశ్వరరావు, మంద వెంకటేశ్వర్లు, నందిరెడ్డి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణలో కరెంటు కోత

గరిడేపల్లి : బంగారు తెలంగాణలో 24 గంటలు విద్యుత్‌ సరఫరా చేస్తున్నామని చెప్పుకుంటున్న సీఎం కేసీఆర్‌ ఒక్క గంటలోనే అనేకసార్లు కరెంటు కోత పెడుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్‌ స్టేషన్‌లో ఒక ఫీడర్‌ చానల్‌పై కరెంటు ఉంటే మరో ఫీడర్‌ చానల్‌పై కరెంటు ఉండని పరిస్థితి నెలకొందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కౌన్సిల్‌ సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు అప్పయ్య, అంజిరెడ్డి ఉన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

హుజూరన్‌నగర్‌ రూరల్‌ : మండలంలోని కరక్కాయలగూడెంలో ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు గురువారం డీసీఎంఎస్‌ డైరెక్టర్‌ దొంగరి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మచ్చ వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అంకతి ప్రభాకర్‌, మాజీ ఎంపీపీ గొట్టెముక్కల నిర్మల, లక్ష్మీనారాయణ, సుశీల వీరబాబు, నాగజ్యోతి, వీరయ్య పాల్గొన్నారు.